# వస్తు మార్పిడి

**"పిల్లలు జాగ్రత్త! పెందరాళే భోజనం చెయ్యండి. అత్తగారికి రాత్రి మందులివ్వడం మరచిపోవద్దు. పిల్లల్ని కాస్త చదివించండి. పొద్దుపోయేదాకా టి.వి. చూడనివ్వొద్దు"**

**వర్ధని జాగ్రత్తల దండకం పూర్తి కాకుండానే రైలు కదిలింది. ఊపిరి పీల్చుకుంటూ ఇంటిదారి పట్టాడు వెంకటేశం.**

అతని పెద్దమ్మ మనవరాలి పెళ్ళి ఎక్కడో పల్లెటూరిలో. ముందు కుటుంబం అంతా వెళదామనుకున్నారు. పిల్లల పరీక్షలు అడ్డువచ్చాయి. తర్వాత అత్తాకోడలు వెళదామనుకున్నారు. ప్రయాణం రెండ్రోజులుందనగా ఆవిడ బాత్రూమ్‌లో కాలుజారి పడ్డారు. డాక్టరు కాలికి కట్టుకట్టి రెస్ట్ తీసుకోమన్నారు. ఇక వర్ధనికి తప్పలేదు. ''మా కాలం ప్రేమలు, అభిమానాలు మీకు తెలీవు. మన ఇంటినుంచి ఎవరో ఒకరు వెళ్ళవలసిందే'' అని పట్టుబట్టింది పెద్దావిడ.

రైలు దిగి, బస్సెక్కి, బస్సు దిగి రిక్షా ఎక్కి, రిక్షాదిగి లాంచీ ఎక్కి ఆ తర్వాత అరగంట నడుచుకుంటూ పెళ్ళివారిల్లు చేరేసరికి ఒళ్ళు హూనమయింది వర్ధనికి. అంతా ఆదరంగా పలకరించారుగానీ ఒకళ్ళ తర్వాత ఒకళ్ళు అడిగిన ప్రశ్నలే అడిగి తెగ విసిగించారు. పెళ్ళికూతురు వకుళకి ఆషాఢమాసం సేల్‌లో కొన్న చీర, ముత్యాల సెట్టు ఇచ్చింది వర్ధని. ఆ ముత్యాల సెట్టు వెంకటేశానికి ఆఫీసు తరపున కాంప్లిమెంటరీ గిఫ్ట్ వచ్చింది. పెళ్ళికూతురికి ఏదైనా కొను అని అత్తగారు ఇచ్చిన వెయ్యి రూపాయలు తను దాచుకుంది. చీరని పక్కన పడేసినా, ముత్యాల సెట్ మాత్రం అందరి చేతులూ తిరిగింది.

'హైదరాబాదంటే ముత్యాలకి పెట్టింది పేరు' అని ఒకరంటే 'బంగారంతో చుట్టించుకుంటే రెండు తరాలు పెట్టుకోవచ్చు' అని మరొకరన్నారు. 'అన్ని కానుకల్లోకి మా అక్క పంపింది ప్రత్యేకంగా ఉంది. ఎలాగయినా మా కాలం ప్రేమలే వేరు!' అంటూ ఆనందభాష్పాలు తుడుచుకుంది పెళ్ళికూతురి మామ్మగారు.

పెళ్ళయ్యాక తాము పెట్టిన నేతచీర చూసి మొహం ముడిచిన వర్ధనిని ''మాకేం ఫేషన్లు తెలీవమ్మా, నా చీరల్లో నీకేదయినా నచ్చినది ఉంటే తీసుకెళ్ళు'' అంది పెళ్ళికూతురి తల్లి. తెల్లచీర మీద జరీదారంతో చిప్స్ నక్కులు కట్టిన చీర తీసుకుంది వర్ధని. గతుక్కుమంది పెళ్ళికూతురి తల్లి. అది అత్తగారి తెల్ల గ్లాస్కోచీర మీద పాలేరు కూతురు టీవీలో చూసి, పత్రికలు చదివి నేర్చుకుని కుట్టిన పిచ్చిచీర ఆమె దృష్టిలో. 'అదీ' అంటూ ఏదో చెప్పబోయింది ఆమె. ''ఇవిప్పుడు హైద్రాబాదులో ఫేషనులే అక్కా'' అంది వర్ధని. ''శుభమా అని పెళ్ళికి వచ్చి తెల్లచీర పట్టుకుపోతుందేమిటే తింగరిది'' అని బుగ్గలు నొక్కుకుంది ఆమె. 'ఈ కుట్టు సిటీలో కుట్టిస్తే వెయ్యి రూపాయిలైనా అవుతుంది. చూస్తూ చూస్తూ కుట్టించుకోకలేకపోతోంది అంత డబ్బు పోసి. బట్ట కూడా పల్చగా మెత్తగా ఉంది' అనుకుంటూ పైకి మాత్రం ''మా అత్తగారికి ఆ నేతచీర ఇస్తాలే'' అంది ఉదారంగా వర్ధని. పల్లెటూరికి వచ్చి పచ్చళ్ళు తీసుకెళ్ళకపోతే ఎలా అంటూ వర్ధనికి బలవంతంగా ఆ పక్కింటి ఆవిడ రుచికి ఇచ్చిన ఊరగాయ సీసా ఇచ్చేసింది పెళ్ళి కూతురి తల్లి. వాళ్ళు పెట్టినవన్నీ పెళ్ళిలోనే ఖర్చయ్యాయి మరి. కొత్తచీర తీసుకోకుండా పాతది తీసుకుంది అని బోలెడు సానుభూతితో. 'ఒళ్ళు హూనమయితే అయింది గానీ బాగానే గిట్టుబాటయింది' అనుకుంది వర్ధని మనసులో.

★ ★ ★

''ఎందుకే ఇవన్నీ, చిన్ననాటి స్నేహితురాలిని అభిమానంగా చూడడానికి వచ్చావు అంతే చాలు'' అంటూనే వరలక్ష్మి ఇచ్చిన చాక్లెట్లు, బొమ్మలు ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకుంది వర్ధని. ఇద్దరూ చదువుకునే రోజుల నుంచీ స్నేహితులు. పెళ్ళై వరలక్ష్మి అమెరికా వెళ్ళిపోయింది. చాలాకాలం తర్వాత సిటీకి వచ్చింది. వర్ధని ఇంట్లో నాల్గురోజులుంది. వర్ధని కూడా ఆఫీసుకి సెలవుపెట్టి స్నేహితురాలితో పిల్లలతో గోల్కొండ, చార్మినారు, మ్యూజియం, పార్కులు విసుగులేకుండా తిరిగింది. అత్తవారింట్లో అన్ని రోజులుండాలంటే మహా చికాకు వరలక్ష్మికి. అందుకే ప్రాణస్నేహితురాలిని చూడాలి అంటూ వర్ధని ఇంట్లో నాల్రోజులు మకాం పెట్టింది. ఆమెకి పుట్టింటివారు ఎవరూ లేరు. ఆమెని అమెరికా పంపి అన్నగారు సింగపూర్ చెక్కేశాడు ఉద్యోగరీత్యా. ''నేను హోటల్లో ఉంటే బోలెడయ్యేది. పైగా అత్తవారికి ఏం సమాధానం చెపుతాను. వర్ధని ఇల్లు కూడా సకల సదుపాయాలతో హాయిగా ఉంది'' అనుకుంటూ తాను అమెరికాలో సెకండ్స్ సేల్‌లో కొన్న వస్తువుల్లో కొన్ని వర్ధనికిచ్చేసింది వరలక్ష్మి. 'సిటీలో ఉన్నా ఓ సైట్ సీయింగూ లేదూ, పాడూ లేదు. ఉరకలు పరుగులు జీవితం. దారి ఖర్చులు పెట్టుకుని తీసుకెళతానంటోంది, ఇప్పుడు కాకపోతే ఎప్పుడు చూస్తాం' అనుకుంటూ స్నేహితురాలితో బాగా తిరిగింది వర్ధని. వెళ్ళేటప్పుడు ఈ 'ఈ ఎంబ్రాయిడరీ ఇప్పుడిక్కడ ఫేషన్' అంటూ తను పెళ్ళివారింటి నుంచి తెచ్చిన తెల్లచీర, వాళ్ళిచ్చిన ఊరగాయ సీసా ఇచ్చేసింది ఫ్రెండ్‌కి.

ఆ చీర నాలుగైదుసార్లు కట్టేసింది పార్టీలకి. తెలుపు మెయింటైన్ చెయ్యడం కష్టం బాబూ అనుకుంది మనసులో. 'పుట్టింటికి వచ్చి వెళుతున్నట్టే ఉందే' అని మురిసిపోతూ చీర, స్వీట్లు, పచ్చడి సీసా పట్టుకుపోయింది వరలక్ష్మి.

అమెరికా వెళుతూనే సిక్ అయింది వరలక్ష్మి. విషయం తెలిసిన ఆమె భర్త ఫ్రెండు రెండ్రోజులు తన భార్యను తోడుగా పంపాడు. వాళ్ళకి ఈ మధ్యే పెళ్ళయింది. వసుంధర అమెరికా వస్తూనే కంప్యూటర్ కోర్సులు, కారు డ్రైవింగు ఇండియాలో నేర్చుకున్నవే అయినా అమెరికన్ స్టాండర్డ్ ప్రకారం 'అప్‌డేట్' చేసుకునే ప్రయత్నంలో పడింది. మధ్యాహ్నం క్లాసు నుంచి వచ్చాకా వరలక్ష్మి ఇంటికి వెళ్ళి ఆమెకి తోడుగా ఉండి, పిల్లలు స్కూలు నుంచి వచ్చాక వాళ్ళకి కావలసినవి చూసి రాత్రి భర్త ఆఫీసు నుంచి వచ్చాక అతనితో కలిసి ఇంటికి వెళ్ళిపోయేది. వారం రోజుల్లో తేరుకుంది వరలక్ష్మి. కొంచెం ఓపిక వచ్చాక ''ఇండియా నుంచి తెచ్చినవి చూడనే లేదు ఇంకా'' అంటూ వసుంధరని కూడా పక్కన కూచోపెట్టుకుని సూట్‌కేసులు తీసింది. తనకి చుట్టాలు పెట్టిన చీరలు, తను కొన్న డ్రెస్ మెటీరియల్స్ అన్నీ చూపింది ''నీకిందులో ఏది కావాలన్నా తీసుకో వసుంధరా'' అంది. మొహమాటపడింది ఆమె. తను చేసిన సాయం విలువ డాలర్లలో తెలీదు ఆమెకి. ''అలాక్కాదు తీసుకోవలసిందే. మీ అక్క ఇస్తే వద్దంటావా'' అని సెంటిమెంటల్‌గా అడిగింది వరలక్ష్మి. పోలిథిన్ కవర్‌లో పేక్ చేసిన ఊరగాయను చూస్తూ ''మీకభ్యంతరం లేకపోతే అందులో కాస్త షేర్ ఇవ్వండి'' అంది వసుంధర.

''మొత్తం తీసుకెళ్ళు. మా ఫ్రెండ్ ఇస్తుంటే కాదనకలేక తీసుకొచ్చా. మేం పెద్దగా తినం'' అంటూ పేకెట్ మొత్తం ఆమె చేతిలో పెట్టింది. ఆరోజు రాత్రి ఊరగాయతో అన్నం తిన్నాక, తల్లికి ఫోన్ చేసింది వసుంధర. ''అమ్మా! ఎవరో తెలుసున్నవాళ్ళు నాకు ఊరగాయ ఇచ్చారు. అది అచ్చంగా నువ్వు పెట్టినట్టే ఉందమ్మా. మామిడికాయ కూడా మన ఊరి కాయలా రుచిగా అనిపించిందమ్మా'' అంటూ ఆనందంగా చెప్పింది. తూర్పుగోదావరి జిల్లాలో మారుమూల పల్లెటూళ్ళో ఉన్న ఆమె తల్లి కళ్ళు ఒత్తుకుంటూ ''ఊరగాయ పెడుతూ వెయ్యి సార్లైనా నిన్ను తలుచుకున్నానే అమ్మాయ్! ఎంతో రుచిగా కుదిరింది కానీ ఎవరికీ ఇవ్వబుద్ధవలేదనుకో. మన పక్కింటి వకుళా వాళ్ళకి మాత్రం ఓ సీసాడు ఇచ్చా అంతే'' అంది.

వస్తు మార్పిడితో సముద్రాలు, ఖండాలు దాటి చేరవలసిన చోటికి చేరాను అన్నట్టుగా ప్లాస్టిక్ కంటెయినర్‌లో ఉన్న ఊరగాయ తృప్తిగా నిట్టూర్చింది.

**-కాకర్లమూడి జ్యోతిమోహన్.**